# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 04-04-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **అమరావతిని ఫ్యూచర్ సిటీగా నిర్మించాలనే ప్రభుత్వ ఆలోచనను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

2. **పునరుత్పాదక విద్యుత్‌కు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్న విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్.**

3. **రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా కింద 64 లక్షల మందికి పింఛన్లను పంపిణీ చేస్తోందని పేర్కొన్న మంత్రి కొల్లు రవీంద్ర.**

4. **"అంతర్జాతీయ గనుల అవగాహనా దినోత్సవాన్ని" ఈరోజు జరుపుకుంటున్నాం.**

============================

అమరావతిని ఫ్యూచర్ సిటీగా నిర్మించాలనే ప్రభుత్వ ఆలోచనను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాజధాని నిర్మాణ పనులపై గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి ఈరోజు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుతం రాజధానిలో వివిధ దశల్లో 57 వేల 821 కోట్ల రూపాయల విలువైన నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా త్వరితగతిన పనులు పూర్తిచేయాలని ముఖ్యమంత్రి నిర్మాణ సంస్థలను ఆదేశించారు.

-------------------------

ఇతర రాష్ట్రాల చేపల పడవల చొరబాట్ల వల్ల రాష్ట్రానికి చెందిన మత్స్యకారుల జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఈరోజు ఆయన మాట్లాడుతూ... బాపట్ల నుంచి సూళ్లూరుపేట వరకు ఉన్న సముద్ర జలాల్లో 4 హైస్పీడ్ పెట్రోలింగ్ బోట్లతో గస్తీ పెంచాలని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతినకుండా, దళారుల జోక్యం తగ్గించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

-------------------------

"అంతర్జాతీయ గనుల అవగాహనా దినోత్సవాన్ని" ఈరోజు జరుపుకుంటున్నాం. పలు దేశాల్లో సామాజిక, ఆర్థిక అభివృద్ధికి, జనాభాకు గనులు, పేలుడు పదార్థాల అవశేషాలు తీవ్ర అవరోధం కలిగిస్తున్నాయి. ఈ క్రమంలో వీటి ప్రభావాన్ని ఎదుర్కొంటున్న దేశాల్లో ప్రమాదాలను నివారించే లక్ష్యంతో ఈరోజును నిర్వహిస్తున్నారు. జాతీయ గనుల రక్షణ చర్యలను సమర్థంగా రూపొందించి.. అమలు చేసే లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి "గనుల అవగాహనా దినోత్సవాన్ని" ప్రతి ఏటా ఏప్రిల్ 4వ తేదీన నిర్వహిస్తోంది. గనుల రక్షణ, ప్రజల ఆరోగ్యం, భద్రత చర్యలు వంటి అంశాలపై ఈరోజు అవగాహన కల్పిస్తున్నారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో గ్రామాల్లోని మహిళలు కూడా ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. తిరుపతిజిల్లా శ్రీకాళహస్తి మండలం బొక్కసంపాలెం గ్రామంలోని మహిళలు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఉపాధి కల్పనా పథకాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవడంతో జాతీయ స్థాయి అవార్డు దక్కించుకున్నారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందిన రేఖ, అన్నపూర్ణలు తమ అనుభవాన్ని వివరిస్తూ ...

..వాయిస్‌లు ...25 సెకన్లు ( రేఖ, అన్నపూర్ణలు)

---------------------------

విశాఖపట్నం జిల్లాలో అడవివరం గ్రామంలోని ఎం.జె.పి. పాఠశాల, కళాశాల వసతి గృహాలను రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బి. కాంతారావు ఆకస్మికంగా నిన్న తనిఖీ చేసారు. ఇటీవల ప్రచురితమైన గురుకులంలో ఎలుకలు అనే వార్త ఆధారంగా ఈ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. వసతి గృహంలో ఎలుకలను నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కాంతారావు ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఇచ్చే మెనూ సక్రమంగా అమలు చేయాలని, వసతి గృహం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కాంతారావు పేర్కొన్నారు.

---------------------------

పునరుత్పాదక విద్యుత్‌కు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. మార్కాపురం జిల్లా గిద్దలూరు మండలం క్రిష్టంశెట్టిపల్లెలో పీఎం సూర్యఘర్ పథకాన్ని మంత్రి నిన్న ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 6 లక్షలకు పైగా పీఎం సూర్యఘర్ ఫదకానికి దరఖాస్తులు అందాయని, త్వరలోనే వ్యవసాయానికి సోలార్ ద్వారా 9 గంటల నిరంతరాయ విద్యుత్ అందిస్తామని మంత్రి తెలిపారు. వివిధ వర్గాల ప్రజలకు రాయితీతో విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని రవికుమార్ తెలిపారు.

---------------------------

శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలో జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా శ్రీ నీలమణి అమ్మవారి ఆలయం వద్ద జరుగుతున్న ఫ్లై ఓవర్ నిర్మాణాన్ని ఆలయం దెబ్బ తినకుండా అధికారులు మార్పులు చేసారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు విజ్ఞప్తి మేరకు అధికారులు మార్పులు చేయటం వల్ల ...ఆలయ ప్రాముఖ్యత కాపాడేలా, మహా జాతర ఉత్సవాలకు సైతం ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండ నిర్వహించుకునేందుకు అవకాశం ఉంటుంది. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ ....

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా కింద 64 లక్షల మందికి పింఛన్లను పంపిణీ చేస్తోందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నంలో ఆయన నిన్న ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ .. గ్రీవెన్స్ లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించటమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. తల్లికి వందనం పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 10 కోట్ల రూపాయల నగదును ప్రతి సంవత్సరం విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నామని మంత్రి తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం కింద 20 వేల రూపాయల చొప్పున రైతుల బ్యాంకు ఖాతాలో జమచేస్తున్నామని మంత్రి వివరించారు.

---------------------------

పార్వతీపురం మన్యం జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి అనుకూలంగా ఉన్న భూముల వినియోగంపై సమగ్ర నివేదిక సమర్పించాలని పారిశ్రామిక వాణిజ్య శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ యువరాజ్ జిల్లా అధికారులను ఆదేశించారు. పాచిపెంట మండలం పెద కంచూరు గ్రామం వద్ద అల్యూమినియం ఫ్యాక్టరీ ఏర్పాటుకు గల సాధ్యాసాధ్యాలను ఆయన నిన్న జిల్లా సంయుక్త కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన అప్రోచ్ రోడ్ల నిర్మాణం, ఇతర మౌలిక వసతుల కల్పనపై గల అవకాశాలను అధికారులు పరిశీలిస్తున్నారు.

---------------------------

ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు అధిక దిగుబడి సాధించవచ్చని ఆంధ్రప్రదేశ్ సామూహిక సహజ వ్యవసాయ ప్రాజెక్ట్ అనంతపురం జిల్లా మేనేజర్ లక్ష్మ నాయక్ తెలిపారు. అనంతపురంలో ఈరోజు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ఆయన వివరించారు.

---------------------------

దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్ దాని పరిసరాలపై ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. మరట్వాడా నుంచి అంతర్ కర్ణాటక మీదుగా దక్షిణ తమిళనాడు వరకు ఏర్పడిన ద్రోణి సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోంది. వీటి ఫలితంగా రాగల రెండు రోజుల్లో రాష్ట్రంలోని ఉత్తర కోస్తాంధ్ర ప్రదేశ్, యానాంలలో తేలిక పాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని వాతావరణ కేంద్రం అధికారి జి. లక్ష్మి తెలియజేస్తూ..

.

.. వాయిస్.. 25 సెకన్లు

---------------------------

తూర్పుగోదావరి జిల్లాలో అనధికారికంగా పాలు విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. ఇటీవల జిల్లాలో జరిగిన కల్తీ పాల ఘటనల నేపథ్యంలో జిల్లాలోని అన్ని స్థాయిల పాల ఉత్పత్తి దారులు, విక్రేతలు తప్పనిసరిగా తమ వ్యాపారాన్ని భారత ఆహార భద్రత, ప్రమాణాల అథారిటీలో నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో పాలు, పాల ఉత్పత్తులు, మాంసాహార పదార్థాల నాణ్యతను కట్టుదిట్టంగా పర్యవేక్షించేందుకు పశు సంవర్ధక శాఖ, ఆహార భద్రతా అధికారులతో సంయుక్త బృందాన్ని ఏర్పాటు చేసామని కలెక్టర్ వివరించారు.

=====================